క్లుప్తంగా

విద్యుత్‌కు రేపు అంతరాయం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులలో భాగంగా స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బ్రిడ్జి కౌంటీ ఫీడర్‌పై గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఇన్‌చార్జ్ ఈఈ నటరాజన్ మంగళవారం తెలిపారు. బ్రిడ్జి కౌంటీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయు), ఆదికవి నన్నయ యూనివర్సిటీలలోని అన్ని రకాల సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



సింగంపల్లి హైస్కూల్‌కు మొక్కలు అందించిన గ్రాసిం ఇండస్ట్రీ

రంగంపేట: విద్యార్థులు మొక్కల పెంపకాన్ని బాధ్యతగా చేపట్టి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు ఎన్‌జేకే శుభాకరరెడ్డి సూచించారు. మండలంలోని సింగంపల్లి హైస్కూల్లో గ్రాసిమ్ ఇండస్ట్రీ సమకూర్చిన 200 మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రాసిమ్ ఇండస్ట్రీ ఉద్యోగులు పాల్గొన్నారు.

19లోపు వాహన మిత్రకు దరఖాస్తు చేసుకోవాలి

రాజానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు ఆర్థిక సాయం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఈనెల 19లోగా తమ దరఖాస్తులను సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో అందజేయాలని ఎంపీడీఓ జేపీ ఝాన్సీ మంగళవారం తెలిపారు. ఈ దరఖాస్తుతోపాటు ఆధార్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం సీ బుక్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లను కూడా జత చేయాలన్నారు. అలాగే దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ కార్డు లింకై ఉన్న మొబైల్‌కి ఓటీపీ వస్తుందని, లేకుంటే బయోమెట్రిక్ చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారునికి తప్పనిసరిగా ఎన్‌పీసీఐ లింక్ ఉండాలన్నారు.

నవలా సామ్రాట్ శరత్ చంద్రకు ఘన నివాళి

రంగంపేట: మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో స్థానిక బాల గణపతి ఆలయం వద్ద నవలా సామ్రాట్ శరత్ చంద్ర చటోపాధ్యాయ 150వ జయంతిని రాజకీయ, సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా చరత్ చంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మరిడయ్య మాట్లాడుతూ, శరత్ చంద్ర బెంగాలీలో అనేక నవలలు, కథలు, నాటికలు, వ్యాసాలు రచించారని అన్నారు. శరత్ చంద్ర రచించిన నవలల ఆధారంగానే దేశంలో, పొరుగు దేశాల్లో సుమారు 90 సినిమాలు రూపొందించారని తెలిపారు. ఆయన రచించిన నవల ఆధారంగానే దేశంలో 14 భాషల్లో దేవదాసు సినిమా వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పేపకాయల వెంకన్న, చోడాబత్తుల రాంబాబు, కర్రి సుబ్బారావు, తోట సత్యనారాయణ, మల్లెల సత్యనారాయణ, తోట నాని, అడబాల బుల్లిరాజు పాల్గొన్నారు.

పీఏసీఎస్ రికార్డుల పరిశీలన



యూరియా రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

సీతానగరం: మండలంలోని ములకల్లంక పీఏసీఎస్ రికార్డులను విజిలెన్స్ సీఐ మధుబాబు పరిశీలించారు. మంగళవారం ములకల్లంక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా అందిస్తున్న యూరియా ఏ విధంగా రైతులకు అందించారనేది విజిలెన్స్ సీఐ తన సిబ్బందితో కలిసి రికార్డులను పరిశీలించారు. రైతులకు అందించిన స్లిప్‌లను ఆధారంగా చేసుకొని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఓ గౌరీదేవి, పీఏసీఎస్ సీఈవో ఉండవల్లి శ్రీనివాసరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపిక

అనపర్తి: విద్యావారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ఓల్డ్ టౌన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. మంగళవారం జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న ఓల్డ్ టౌన్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కె.పూజిత, లతాశ్రీమహాలక్ష్మి, కె.మాధురి మొదటి స్థానంలో నిలిచారు. విద్యార్థినులకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయురాలు కె.సుజాత అభినందించారు.

కానరాని కందిపప్పు

- రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే పంపిణీ
- బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరకుల ధరల మోత
- మండుతున్న పప్పులు, వంట నూనె ధరలు
- పేద, మధ్య తరగతి ప్రజలు సతమతం



రేషన్‌షాపుల్లో సరాఫరా చేసే కందిపప్పు (ఫైల్)

పెదపూడి: ప్రజలు నిత్యం వాడే సరుకుల్లో కందిపప్పు ఒకటి. కందిపప్పు ధర ఆకాశాన్నంటినప్పటికీ ప్రతి ఇంటిలో వారంలో రెండు నుంచి మూడు రోజులకు ఒకసారి కందిపప్పు వాడాల్సిందే. అలాంటి నిత్యావసర సరకును గత ప్రభుత్వం పేదలకు ప్రతి నెలా రేషన్ వాహనాల ద్వారా సరఫరా చేసేది. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీ చేయట్లేదు. లబ్ధిదారులు అడిగిన ప్రతిసారి వచ్చే నెల వస్తుందని డీలర్లు చెప్పడం తప్ప వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. అసలు ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

కందిపప్పు కిలో రూ.150

నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలో ధర రూ.100 నుంచి రూ.150 వరకు ఉంది. పేద మధ్య తరగతి ప్రజలు కందిపప్పు కొనలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం సరఫరా చేసిన విధంగా ప్రతి కార్డుకు కిలో కందిపప్పు అందించాలని పలువురు కోరుతున్నారు. కందిపప్పు సరఫరాపై కార్డుదారులు డీలర్ల వద్ద వాకబు చేస్తున్నా సరైన సమాధానం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కార్డుదారులు బియ్యం ఒక్కటి మాత్రమే ఇస్తే ఏం చేసుకోవాలి? కుటుంబానికి సరిపడా కందిపప్పు, వంట నూనె తదితర నిత్యావసర సరుకులు అందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పేద మధ్య ప్రజలు ఆవేదనను పరిగణలోకి తీసుకుని రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, వంట నూనె సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

కందిపప్పు సరఫరా చేయాలి



గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ప్రతి కార్డుదారుడికీ కందిపప్పు అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు పేద మధ్య తరగతి వారే ఉన్నారు.బయట మార్కెట్‌లో కందిపప్పు రూ.100 నుంచి రూ.159 వరకు అమ్ముతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కందిపప్పు అందించాలి.

– సీహెచ్ సత్యవాణి, శహపురం

రేషన్ షాపులు, రేషన్‌కార్డు లబ్ధిదారులు వివరాలు

మండలం	రేషన్ షాపులు	లబ్ధిదారులు
అనపర్తి	39	22,277
బిక్కవోలు	40	22,952
పెదపూడి	42	23,786
రంగంపేట	30	20,200
మొత్తం	151	89,215

వైఎస్సార్ సీపీ పులగుర్త గ్రామ శాఖ అధ్యక్షుడిగా గోపాలకృష్ణ



పులగుర్తు కన్వీనర్ గోపాలకృష్ణను అభినందిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పులగుర్త గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అనపర్తి గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాకరపర్తి వేణు, మాజీ సర్పంచ్ వేమగిరి రాజు, ఎంపీటీసీ గుత్తుల మహాలక్ష్మి, విజయ్, మాజీ చైర్మన్ మల్లిడి వెంకటరెడ్డి, వార్డు సభ్యులు గుత్తుల ఏడుకొండలు, దెంగేటి సత్తిబాబు, బొప్పన చిన్న, పల్లెటి రాయుడు తదితర వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి



పందలపాకలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ ప్రణీత్

బిక్కవోలు: రైతులు పాడి పశువులకు తప్పనిసరిగి గాలికుంటు టీకాలు వేయించాలని పందలపాక పశువైద్యుడు ప్రణీత్ అన్నారు. మంగళవారం ఆయన గాలికుంటు నివారణ టీకాలు పశువులకు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, సమతుల పోషకాహారాన్ని అందించడం, సమీకృత దాణాను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలోని రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ కవచంగా ఓజోన్ పొర



పందలపాకలో ఓజోన్ 3 ఆకారంలో విద్యార్థులు



రఘుదేవపురంలో ఓజోన్ పొర ఆవశ్యకతపై డ్రాయింగ్ వేసిన విద్యార్థులు

రాజానగరం: భూమిని ప్రమాదకరమైన కిరణాల నుంచి కాపాడే గొడుగు ఓజోన్ పొర అని, దానిని భావితరాలకు సంరక్షించాలని ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ గోపి అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓజోన్‌ని దెబ్బతీస్తున్న అంశాలు, పరిరక్షణ కోసం చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ఓజోన్ పరిమిత భూమి, పరిమిత చలన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓజోన్ పొరపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బొబ్బిల్లంక హైస్కూల్లో ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ పొర ఆవశ్యకతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల గ్రీన్ కోర్ టీచర్ జనపరెడ్డి మోహనరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే రఘుదేవపురం పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్లకార్డులతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత

బిక్కవోలు: పందలపాకలోని శ్రీ పడాల పెద్దపుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థులు ఓజోన్ అక్షర ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు.మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఓజోన్ పొర ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. చిత్ర లేఖన ఉపాధ్యాయులు మూర్తి ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణ మన అందరి బాధ్యత అనే అంశంపై చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు లయన్స్ క్లబ్ గొల్లల మామిడాడ శ్రీసూర్య సౌజన్యంతో విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలోని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొనాల సత్తి రాజు పాల్గొన్నారు.

అర్హులకు అందని సంక్షేమ పథకాలు



మండల పరిషత్ సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా జరిగింది. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకష్ణారెడ్డి హాజరయ్యారు. ముందుగా మండలస్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అర్హులకు సంక్షేమ పథకాలు అందడంలేదని అధికారులు సహకరించాలని కోరారు. తాగునీరు అందించాలని, బోర్లు వేసుకున్న రైతులకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. రోడ్ల అభివృద్ధి విషయంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైస్ ఎంపీపీలు రాయుడు రాంబాబు, మట్టా శ్రీను, తహసీల్దార్ కోసు అనసూయ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు ‘నన్నయ’లో డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్



బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో బుధవారం డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరగనుందని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మంగళవారం తెలిపారు. 2024–25లో బీఎస్సీ, ఎంఎస్సీలో కెమిస్ట్రీ లేదా బయోటెక్నాలజీ పూర్తి చేసి, 10వ తరగతి నుంచి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ఎంపికైతే బీఎస్సీ వారికి రూ.2.10 లక్షలు, ఎంఎస్సీ వారికి రూ.2.60 లక్షలు వార్షిక వేతనంగా ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈసీఈ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్

యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎస్‌డీవీవీఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఈసీఈ ఫైనలియర్ విద్యార్థులకు బుధవారం నుంచి మూడు రోజులపాటు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ జరగనుందని వీసీ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ని మంగళవారం విడుదల చేశారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



బాలతేజ (ఫైల్)

రంగంపేట: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాత వీరంపాలెం గ్రామానికి చెందిన నల్లమోలు బాలతేజ (22) ఈనెల 15న సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో తన మోటార్ సైకిల్‌పై బయటకి వెళ్లాడు. చీకటిపడినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా ప్రయోజనం లేకపోయింది. మంగళవారం బాలతేజ తండ్రి నల్లమోలు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాలతేజ అచూకీ తెలిసిన వారు రంగంపేట ఎస్సై శివప్రసాద్ 9440904854, అనపర్తి సీఐ సుమంత్ 9440796538 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా సత్య

రాజానగరం: మండలంలోని తూర్పుగానుగూడెం సర్పంచ్ గళ్లా సత్యను రాజానగరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టరుగా నియమించారు. సర్పంచ్‌ల కోటాలో తనకు ఈ అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు మంగళవారం ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పీఈటీ ఉద్యోగాలకు నలుగురి ఎంపిక



చిక్కాల అజ్జిబాబు



ముదుగు శ్యాంబాబు



పెంకే సత్యనారాయణ



చందన కుమార్

బిక్కవోలు: ఆటలపై ఉన్న ఆసక్తి వారిని వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యేలా చేసింది. వ్యవసాయ కుటుంబాలకు చెందిన నలుగురు యువకులు 2025 డీఎస్సీ పరీక్షలో ప్రతిభచాటి సోమవారం విడుదలైన తుది జాబితాలో స్థానం పొందారు. మండలంలోని ఊలపల్లికి చెందిన చిక్కాల అజ్జిబాబు, ముదుగు శ్యాంబాబు, పెంకే సత్యనారాయణ, కడియాల మనోహర చందనకుమార్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న సమయంలో పీఈటీ వెంకన్న చౌదరి ప్రోత్సాహంతో క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. 2014–15లో వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేశారు. 2018 డీఎస్సీలో ఆశించిన ఫలితం రాకపోవడంతో నిరాశ చెందకుండా పట్టుదలతో కృషి చేసి ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీలో సత్తా సాటి వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో హెచ్ఐవీ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు మాట్లాడుతూ, నేటి యువత హెచ్ఐవీ బారిన పడకుండా తగు జాగ్రత్తలు వహించాలని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ, వారి బంగారు భవిష్యతుకు బాటలు వేసుకోవాలని సూచించారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు వాణి మాట్లాడుతూ, హెచ్ఐవీ, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కోరారు. అలాగే కోనసీమ సేవా మండలికి చెందిన రాజశేఖర్, నాగమణి పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

నేడు ‘యాత్ర సేవా దివస్’

కోరుకొండ: రాజమండ్రి విమానాశ్రయంలో బుధవారం ‘యాత్ర సేవా దివస్–2025’ ఘనంగా నిర్వహిస్తామని విమానాశ్రయ డైరెక్టర్ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో అన్ని విమానాశ్రయాలు ఈ దినోత్సవాన్ని ఒకేసారి నిర్వహించనున్నాయి. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విమనయానం చేసే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందించేందుకు ఏఏఐ తీసుకున్న చర్యలను ప్రతిబింబించేలా ఈ దినోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. రాజమండ్రి విమానాశ్రయంలో జరిగే ప్రధాన కార్యక్రమాలు సాంస్కృతిక ప్రదర్శనలు, క్విజ్, పెయింటింగ్ పోటీలు, విమానాశ్రయ భవనాల అలంకరణలు, ప్రయాణికులకు ఉచిత వైద్య పరీక్షలు ఆతిధ్య సత్కారం కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అమ్మ పేరుతో ఒక మొక్క నినాదంతో చెట్లు నాటడం, సీనియర్ సిటిజన్లు సత్కారం, విద్యార్థులు, విమానాశ్రయ సిబ్బందితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలు విమానాశ్రయాలు, ప్రయాణికులకు మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించడంలో ఏఏఐ దార్శనికతను ప్రతిబింబిస్తాయని వివరించారు.

ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం ప్రభుత్వ స్కూల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ స్తంభంపై అమర్చారు. ఈనెల 13న సాక్షి పత్రికలో ‘ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్’ కథనం ప్రచురించారు. దీనిపై స్పందించిన మండల విద్యుత్ శాఖాధికారి చంద్రమోహన్ మంగళవారం తన సిబ్బందితో వెళ్లి కింద ఉన్న సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, ఎటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం లేకుండా విద్యుత్ స్తంభానికి పై ఎత్తులో సింగల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ శాఖాధికారులకు, సాక్షి దినపత్రికకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



పురుషోత్తపట్నంలో విద్యుత్ స్తంభం పైభాగంలో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్

పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి

అనపర్తి: సీపీఎస్ అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగానికి ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలయ్యేలా చూడాలని 2003 డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ టి.జయకృష్ణారెడ్డి మాట్లాడుతు కొన్ని కారణాల వలన అలస్యంగా ఉద్యోగాల్లో చేరినందున సీపీఎస్ పరిధిలోకి వచ్చేశామని కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు మెమో 57ను అనుసరించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరింపజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.శ్రీనివాసులురెడ్డి, ఎస్.భాస్కరరామారావు, సీహెచ్.వీరభద్రం పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

అనపర్తి: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని వైద్యులు సూచించారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం దోహదపడుతుందని డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ ప్రియాంక అన్నారు. ఈ పథకంలో భాగంగా ఈ నెల 17నుంచి అక్టోబరు 2వరకు మండల వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతులమీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. 18న కుతుకులూరు పీహెచ్‌సీలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహిళలు, పిల్లలు, కిశోర బాలికలకు, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించండి

బిక్కవోలు: సూర్యఘర్ పథకంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ తేతలి సుమ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తేతలి సుమ ఆదేశాల మేరకు అధికారులు తమ శాఖవారీగా నివేదిక అందించారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో అందించే సూర్యఘర్ పథకాన్ని ప్రజలు ఉపయోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. నూతనంగా ఎంపికైన కొమరిపాలెం, కొంకుదురు సొసైటీ అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. వెటర్నరీ సేవల విభాగంలో రాష్ట్రంలో బిక్కవోలు మండలం మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన వెటర్నరీ అసిస్టెంట్ జె.సత్యవేణి, బిక్కవోలు పశుసంవర్ధక శాఖ డాక్టర్ తిరుమలరావు, మండల పశువైద్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోని జెడ్పీటీసీ రొంగల పద్మావతి, మండల ప్రత్యేక అధికారి టి.శ్రీదేవి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, వైస్ ఎంపీపీ పెంకె మంగయ్యమ్మ పాల్గొన్నారు.